సాక్షి ప్రకాశం

సోమవారం । 22 । జులై । 2024



స్పా సెంటర్లపై దాడుల్లో పది మంది అరెస్టు

నగరంలోని పలు స్పా సెంటర్లపై దాడులు చేసి పది మందిని పోలీసులు అరెస్టు చేశారు. - 8లో..



నడిరేయి మృత్యుకేక

మార్కాపురం మండలం చింతగుంట్ల, తిప్పాయపాలెం గ్రామాల మధ్య హైవేపై ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తాపడి ఇద్దరు మృతిచెందారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
32/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

23న రాష్ట్రస్థాయి బండలాగుడు పందెం

కొమరోలు: మండలంలోని బాదినేనిపల్లె గ్రామంలో మొహర్రం పర్వదినం సందర్భంగా ఈనెల 23వ తేదీ రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లుగా నిర్వాహకులు తెలిపారు. బండలాగుడు పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేల నగదు బహుమతులు అందచేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 6301482395, 9640819458 మొబైల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన చెస్ క్రీడాకారులు వీరే



రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఒంగోలు: రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన చెస్ క్రీడాకారుల వివరాలను ప్రకాశం జిల్లా చదరంగ సమాఖ్య కార్యదర్శి షేక్ అబ్దుల్ నబీ ఆదివారం మీడియాకు విడుదల చేశారు. స్థానిక ఐకాన్ గ్లోబల్ స్కూలులో జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. బాలుర కేటగిరీలో బత్తిన అభినందన్, రెండో స్థానంలో మామిడి సృజన్, బాలికల విభాగంలో మొదటి స్థానంలో సాయి శ్రేష్ఠ, రెండో స్థానంలో లాస్య శ్రీప్రియ నిలిచారన్నారు. వీరు ఈనెల 27, 28 తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ సందర్భంగా ఐకాన్ గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ కాసా చిరంజీవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు పాల్గొన్న పోటీలో తమ పాఠశాల విద్యార్థి బి.అభినందన్ మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు.

ఈ-క్రాప్‌పై నీలి నీడలు

అన్నదాతకు అన్ని విధాలుగా ఉపయోగపడే ఈ-క్రాప్ పథకం అమలుపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. జిల్లాలో ఖరీఫ్ పనులు చురుగ్గా సాగుతున్నా వ్యవసాయ విధి, విధానాలపై స్పష్టమైన వైఖరిని కూటమి ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. దీని వల్ల ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పటికే రైతు భరోసా పథకం కింద పంట సాయం అందక ఆందోళన చెందుతున్న రైతులకు ప్రభుత్వ తీరు తీవ్ర ఆగ్రహాన్ని, ఆవేదనను కలిగిస్తోంది.

- స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం
- అమలు చేయకపోతే పంటలు సాగు చేసిన రైతులకు తీవ్ర నష్టం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- ఈ-క్రాప్ నమోదు కోసం ఎదురు చూపు



గత ప్రభుత్వంలో ఈ- క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

ఒంగోలు సెంట్రల్:

గత ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేసిన రైతు భరోసా, ఈ-క్రాప్, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలు అమలవుతాయో లేదో అని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఆయా పథకాలపై కూటమి ప్రభుత్వం దాగుడు మూతలు ఆడటం రైతన్నలు గమనిస్తున్నారు. జిల్లాలో గత ఏడాది ఖరీఫ్‌లో 3,74,652 ఎకరాలు సాగు చేయగా, 3,59,965 ఎకరాలు ఈ-క్రాప్ నమోదు చేశారు. అదే విధంగా రబీలో 3,05,297.5 ఎకరాలు సాగు చేయగా 3,04,772 ఎకరాలు ఈ క్రాప్ నమోదు చేశారు. ఖరీఫ్‌లో ఈ ఏడాది 3,75,205 ఎకరాల్లో పంట సాగు లక్ష్యంగా వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేయగా ఇప్పటికి 44,254.99 ఎకరాల్లో పలు పంటలు సాగు చేశారు. రైతులు గింజ విత్తినప్పటి నుంచి కోత, అమ్మకం వరకు అండగా ఉండే ఈ-క్రాప్ విధానాన్ని అమలు చేయకపోతే భవిష్యత్‌లో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు పండించే ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించేందుకు, ప్రకృతి వైపరీత్యాల సంభవించినప్పుడు అండగా ఉండేందుకు, అర్హులైన రైతులకు అన్ని విధాలుగా మేలు చేసేందుకు ఈ-క్రాప్ విధానం చక్కగా తోడ్పాటు అందించేది.


గత ప్రభుత్వంలో అమలైంది ఇలా...

ప్రభుత్వం మంజూరు చేసే ప్రతి రూపాయి గ్రామ స్థాయిలో రైతులకు అందజేయాలన్న ఆశయంతో 2019 రబీ సీజన్‌లో ప్రతిష్టాత్మకమైన ఈ-క్రాప్ విధానాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. రైతు భరోసా యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్ ఫాం (ఆర్‌బీ అండ్ యూడీపీ) యాప్ ద్వారా వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పశుగ్రాస పంటలతో పాటు సామాజిక వనాలను ఆర్‌బీకేల్లో నమోదు చేయటం ద్వారా పారదర్శకత ఉండేది. రెవెన్యూ వెబ్ ల్యాండ్ డేటాను అనుసరించి క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అంశాల ఆధారంగా ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు ఈ-క్రాప్ విధానంలో పంట నమోదు చేసేవారు. ఈ-క్రాప్ విధానం అమలులో ఉండటం వల్ల రైతు సాగు చేసే పంట వివరాలు వ్యవసాయ శాఖలో నమోదయ్యేవి. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న వెంటనే సంబంధిత రైతు వివరాలన్నీ ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్‌లో నిక్షిప్తమయ్యేవి. సమయానికి ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలు రాయితీపై లభించే అవకాశం ఉంది. రైతులకు ప్రభుత్వమే బీమా సొమ్ము చెల్లించి ఉచితంగా పంటల బీమా చేయించటం ద్వారా రైతుల్లో సాగు పట్ల ధీమా కలిగి ఉండేవారు. పండితే పంట.. లేకుంటే బీమా వస్తుండటంతో రైతన్నలు సాగు చేయటానికి ఎంతో సన్నద్ధంగా ఉండేవారు. ఈ-క్రాప్ విధానంలో నమోదైన భూమిని బట్టి ఇన్‌పుట్ సబ్సిడీని త్వరితగతిన మంజూరు చేసేందుకు ప్రభుత్వానికి వీలు కలిగేది. రైతులు పండించిన తమ పంట ఉత్పత్తులను ఎప్పుడైనా తనకు నచ్చిన రీతిలో గిట్టుబాటు ధరకు విక్రయించే అవకాశం లభించేది. రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేసే ప్రతి ఉత్పత్తికి సంబంధించి రసీదులు అందజేయటం ద్వారా క్షేత్ర స్థాయి వ్యవసాయ సహాయకులు పారదర్శకత పాటించేవారు.



సాగర్ ఆయకట్టులో సాగు చేసిన కంది, మినుము మిశ్రమ పంట

తీవ్రంగా నష్టపోతాం



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ విధానాన్ని సక్రమంగా అమలు చేయకపోతే రైతు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. గతంలో నాలుగు ఎకరాలు కంది వేసి ఎండిపోయి తీవ్ర నష్టం జరిగింది. వ్యవసాయ అధికారులు పరిశీలించారు. రూ.70 వేల వరకు నష్టపరిహారం వచ్చింది. ఈ-క్రాప్ వలన నిజమైన లబ్ధి చేకూరింది. ఈ-క్రాప్ చేయకపోతే పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర పొందే అవకాశం కోల్పోతాం. ఇకనైనా ప్రభుత్వం ఈ-క్రాప్ విధానాన్ని కొనసాగిస్తే నిజమైన రైతులకు మేలు జరుగుతుంది.

– కైపు రమణా రెడ్డి, రమణాలవారిపాలెం, తాళ్లూరు మండలం.

ఇంకా ఆదేశాలు అందలేదు



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ విధానం అమలుపై ప్రభుత్వ పరంగా ఏ విధమైన ఆదేశాలు అందలేదు. వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ పనులు ప్రస్తుతం మరింత ఊపందుకున్నాయి. త్వరలోనే ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయం ప్రకారం ప్రతి రైతుకు మేలు చేసేలా వ్యవసాయాధికారులు, సిబ్బంది తమ వంతు తోడ్పాటు అందిస్తాం.

– ఎస్.శ్రీనివాసరావు, జేడీఏ, ఒంగోలు

ఈ-క్రాప్‌లో గత ఖరీఫ్‌లో నమోదైన విస్తీర్ణం **3.57** లక్షల ఎకరాలు

గత రబీలో నమోదైంది **3.04** లక్షల ఎకరాలు

ఈ ఏడాది ఖరీఫ్ సాగు లక్ష్యం **3,75,205** ఎకరాలు

ఇప్పటి వరకు సాగైంది: **44,254.99** ఎకరాలు

అమలు చేయకపోతే అన్నదాతకు కష్టాలు

వరి సాగు చేపట్టే రైతులు, కౌలు రైతుల వివరాలు, సర్వే నంబర్ల వివరాలు వ్యవసాయ శాఖ వద్ద సమగ్రంగా ఉండే అవకాశం లేదు. పంట సాగు వివరాలు తెలియకపోవటంతో సంబంధిత వ్యవసాయశాఖ అధికారులకు ఆ రైతులకు అవసరమైన వ్యవసాయ పరమైన సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఆస్కారం లేకుండా పోతుంది. రాయితీపై విత్తనాలు, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రాయితీలు పొందే హక్కు కోల్పోయే ప్రమాదముంది. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, గిట్టుబాటు ధరలను రైతులు కోల్పోయే అవకాశం ఉంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతింటే పెట్టుబడి రాయితీ పొందే వీలు కోల్పోతారు. ఈ-క్రాప్ విధానంలో పంట నమోదు కాకపోవటం వల్ల అనర్హులకు ప్రభుత్వ రాయితీలు దక్కే ప్రమాదముంది. పలు రకాల పంటలు సాగు చేసే రైతుల సమగ్ర వివరాలు గుర్తించే అవకాశం లేకుండా పోవటంతో పాటు అవినీతి జరిగే అవకాశం ఉంది.

నిర్లక్ష్యంతో నీరుగారుస్తున్నారు !

- 17న విడుదలైన సాగర్ జలాలు
- సాగర్ జలాలతో చెరువులు నింపడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం
- పూర్తిగా అడుగంటిన ఎన్‌ఏపీ రిజర్వాయర్
- నీరు విడుదలయ్యేది పదిరోజులే..
- ఎక్కువ సామర్థ్యం ఉన్న మోటార్లు పెడితేనే చెరువులు నిండేది

దర్శి: సాగర్ జలాలతో మంచినీటి నోటిఫైడ్ చెరువులు నింపడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కనిపిస్తోంది. ప్రస్తుతం నాగార్జున సాగర్ డ్యాంలో 507 అడుగులు నీటి మట్టం ఉంది. 590 అడుగులు నీటిమట్టం ఉంటేనే సాగునీటి కోసం విడుదల చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం సాగర్ డ్యాంలో 126 టీఎంసీలు నీరు ఉంది. అంటే సాగర్ డ్యాం డెడ్ స్టోరేజీలో ఉంది. తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని 4.5 టీఎంసీలు నీటిని కుడికాలువకు కేటాయించారు. ఈ నెల 17వ తేదీన తాగునీటి కోసం సాగర్ జలాలు బుగ్గవాగుకు విడుదల చేశారు. 18వ తేదీ బుగ్గవాగులో నుంచి కుడి కాలువకు నీరు విడుదలైంది. ఈ జలాలు కేవలం తాగునీటి కోసం మాత్రమే కేటాయించారు. త్రిపురాంతకం మొదలుకొని దర్శి వరకు 11 నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. వీటిలో 9 ఆర్‌డబ్ల్యూఎస్ మంచి నీటి చెరువులు కాగా రెండు మున్సిపాల్టీ చెరువులు ఉన్నాయి. నోటిఫైడ్ చెరువులు నింపుకుంటూ రామతీర్థంలోకి ఈ నీరు వెళ్తుంది. నేటి ఉదయం 4 గంటలకు డీబీసీకి సాగర్ నీరు చేరుకుంటుంది. ఈ నీరు పదిరోజులు మాత్రమే విడుదలయ్యే అవకాశం ఉంది.



దర్శి బ్రాంచ్ కెనాల్

నింపాల్సిన నోటిఫైడ్ చెరువులు ఇవే..

యర్రగొండపాలెం ప్రాజెక్ట్, ముటుకుల స్కీం, దూపాడు ప్రాజెక్ట్, గొల్లపల్లి స్కీం, లక్ష్మీపురం, చందవరం న్యూ, చందవరం ఓల్డ్, కురిచేడు, దర్శి ఏఏపీ రిజర్వాయర్లతోపాటు మార్కాపురం మున్సిపాలిటీ, కనిగిరి మున్సిపాలిటీకి సంబంధించిన చెరువులకు నీరు నింపాలి. మార్కాపురం మున్సిపాలిటీకి దూపాడు నుంచి పైప్ లైన్ ద్వారా నీరు తరలిస్తుండగా, కనిగిరికి దర్శి నుంచి పైప్‌లైన్‌ల ద్వారా సాగర్ జలాలు తరలి వెళ్తాయి.



అడుగంటిన ఎన్‌ఏపీ రిజర్వాయర్



ఎన్‌ఏపీ రిజర్వాయర్‌లో రా వాటర్ మురికిగా వస్తున్న దృశ్యం

చెరువులు నింపేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఏవీ..?

పది రోజులు మాత్రమే తాగునీటి కోసం సాగర్ జలాలు విడుదల చేశారు. ప్రత్యేకంగా నోటి ఫైడ్ చెరువులు నింపడం కోసం ప్రత్యేక మోటార్లు ఏర్పాటు చేయాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సాగు కోసం విడుదల చేసినప్పుడు వచ్చే నీటిని నింపుకునే మోటార్ల ద్వారా మాత్రమే చెరువులు నింపుతున్నారే తప్ప ప్రత్యేక మోటార్లతో నీటిని నింపే ఏర్పాట్లు మాత్రం చేయడం లేదు. సాధారణంగా తాగునీటి కోసం సాగర్ జలాలు విడుదలైనప్పుడు పది రోజుల్లో చెరువు నిండేలా ఎక్కువ కెపాసిటీ మోటార్లు ఏర్పాటు చేసుకోవాలి. జనరేటర్‌లు తెప్పించుకుని రాత్రింబవళ్లు నీటిని చెరువుకు పెడితేనే చెరువు నింపడం కష్ట సాధ్యం అవుతుంది.

అడుగంటిన ఎన్‌ఏపీ రిజర్వాయర్

నగర పంచాయతీ పరిధిలోని ఎన్‌ఏపీ రిజర్వాయర్ ఈపాటికే అడుగంటింది. ఈ రిజర్వాయర్ ద్వారా ప్రతి రోజు రెండు లక్షల మందికి తాగు నీరు అందించాల్సి ఉంది. ఈ రిజర్వాయర్‌తో పాటు కనిగిరి చెరువుకు కూడా నీరునింపాలి. నీరు అడుగున పడి మురికిగా వస్తున్నాయి. ప్రస్తుతం వెంటనే సాగర్ జలాలతో రిజర్వాయర్ నింపకపోతే మురికిగా ఉన్న నీరే తాగునీటికి దిక్కవుతుంది. పదిరోజులు మాత్రమే నీరు విడుదలైతే ఇప్పుడు ఉన్న ఏర్పాట్లకు ఎన్‌ఏపీ రిజర్వాయర్ నిండే అవకాశాలే లేవు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక మోటార్లు పెట్టి సాగర్ జలాలతో ఎన్‌ఏపీ రిజర్వాయర్ నింపాలని ప్రజలు కోరుతున్నారు.

అయితే ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.

జలాలు పక్కదారి పట్టే ప్రమాదం:

ప్రత్యేక ఏర్పాట్లు చేసి చెరువులు నింపకపోతే సాగర్ జలాలు పక్కదారి పట్టే ప్రమాదం ఉంది. నాన్ నోటిఫైడ్ చెరువులకు అర్ధరాత్రి నీటిని తరలించి చెరువులు నింపి చేపలు వేసుకుని పెంచుకునేందుకు కొందరు చేపల వ్యాపారులు ఈపాటికే సిద్ధమయ్యారు. అదే జరిగితే తాగునీటి కోసం విడుదల చేసిన లక్ష్యం నీరుగారి పోతుంది. లస్కర్‌లు కాలువల పై పర్యటించి ప్రత్యేక చర్యలు తీసుకుంటేనే తప్ప నీటి చోరీని అరికట్టలేరు. దీనికి తోడు ఆయకట్టు పరిధిలో ఉన్న మెట్టపొలాల వారు కూడా నీరులేని తమ పొలాలకు పెట్టుకునేందుకు మోటార్లు వేసి సిద్ధం చేసుకున్నారు. సాగర్ జలాలు పక్కదారి పట్టించే ప్రమాదం ఉంది. దీంతో తాగు నీటి లక్ష్యం నీరు గారుతుంది.

తాగునీటి అవసరాలకు సాగర్ జలాలు



సాగర్ నీటి సరఫరాపై చర్చిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా



త్రిపురాంతకం ప్రధాన కాలువ ద్వారా జిల్లాకు వస్తున్న సాగర్ జలాలు

- సాగర్ కాలువ, ఎస్‌ఎస్ ట్యాంకు పరిశీలించిన సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

త్రిపురాంతకం: నాగార్జున సాగర్ ప్రధాన కాలువ ద్వారా జిల్లాకు 2450 క్యూసెక్కుల నీటి సరఫరా అవుతోంది. జిల్లాలోని తాగునీటి చెరువులు నింపేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలంలోని విశ్వనాథపురం 101 మైలు వద్ద సాగర్ కాలువను అధికారులు పరిశీలించారు. క్రమేణ నీటి సరఫరా పెరుగుతున్నందున ఎస్‌ఎస్ ట్యాంకులు ముందుగా నింపాలన్నారు. తాగునీటి కోసం ముందుగా పది రోజులు నీటిని విడుదల చేశారని అధికారులు చెబుతున్నారు. సమీపంలోని దూపాడు ఎస్‌ఎస్ ట్యాంకును పరిశీలించిన రాహుల్‌మీనా నీటి సరఫరాపై అడిగి తెలుసుకున్నారు. నీటిని వృథా చేయకుండా తాగునీటి అవసరాలు తీర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ, తహసీల్దార్ రామకృష్ణ, శివప్రసాద్, ఆర్‌ఐ హరి తదితరులు ఉన్నారు.



ఒంగోలు లాయరుపేట సాయిబాబా ఆలయంలో ప్రత్యేక అలంకరణలో మూలమూర్తి

గురుభ్యోన్నమః

గురుపౌర్ణమి సందర్భంగా జిల్లాలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబా ఆలయాల్లో అన్నదానాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



లాయరుపేట సాయిబాబా ఆలయంలో స్వామిని దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు

రైతు బజార్లో రాయితీపై నిత్యావసర సరుకులు

- మంత్రి స్వామి వెల్లడి

ఒంగోలు సెంట్రల్: రైతు బజార్లో రాయితీపై నిత్యావసర సరుకులు అందిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి ఓ పత్రిక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రాయితీపై నాణ్యమైన బియ్యం, కందిపప్పు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఏ-గ్రేడ్ కందిపప్పు కిలో రూ.160, రెండు రకాల నాణ్యమైన సోనా మసూరి బియ్యాన్ని కిలో రూ.48, రూ.49లకే అందిస్తున్నామని చెప్పారు. ఒంగోలులో మూడు రైతు బజార్లతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లోని రైతు బజారుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కౌంటర్లు ఉదయం 8 నుంచి సాయంత్రం 8 గంటల వరకు అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేసి రూ.5కే పేదల ఆకలి తీరుస్తామని తెలిపారు.

విద్యారంగ సమస్యలు అసెంబ్లీలో చర్చించండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

ఒంగోలు టౌన్: జిల్లాలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ డిమాండ్ చేశారు. స్థానిక ఎల్బీజీ భవనంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒంగోలు నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని, పొన్నలూరులో నిర్మించిన ఎస్టీ గురుకుల పాఠశాల భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. మార్కాపురం, గిద్దలూరుల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు మంజూరు చేయాలని, జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలను నిర్మించాలని, ఆంధ్ర కేసరి యూనివర్శిటీకి అనుబంధంగా గవర్నమెంట్ ఇంజినీరింగ్, మైనింగ్ కాలేజీలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. చీమకుర్తిలోని డిగ్రీ విద్యార్థులకు సొంత ఊరిలోనే పరీక్ష కేంద్రాన్ని మంజూరు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సీఎంఈ, ఈసీఈ కోర్సులను ప్రారంభించాలని, పొదిలి, మార్కాపురంలో బాలికల హాస్టళ్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా విద్యారంగం అభివృద్ధి గురించి అసెంబ్లీలో గళం విప్పి మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు విజయ్, కమిటీ సభ్యులు విజయకుమార్ పాల్గొన్నారు.

పెన్షనర్లపై ట్యాక్సులు ఉపసంహరించుకోవాలి

ఒంగోలు టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఈపీఎస్-95 ఉద్యోగులుగా పనిచేసి రిటైర్ అయిన పెన్షనర్లపై వేస్తున్న రకరకాల ట్యాక్సులు వెంటనే ఉపసంహరించాలని ఏఐఆర్పీఏ ప్రకాశం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.శేషయ్య, సీహెచ్ రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్రం ప్రవేశ పెడుతున్న బడ్జెట్లో ఇన్‌కం ట్యాక్స్, ఇతర ట్యాక్సుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఏటా నిత్యావసర వస్తువుల ధరలు, మందుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో అదనపు పన్నుల వలన పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే బడ్జెట్లో ఈ పన్నుల భారం నుంచి పెన్షనర్లకు ఊరట కల్పించి ఆదుకోవాలని కోరారు. అలాగే పీఆర్‌సీ, డీఏ, ఇతర బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

రైలు కిందపడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న కానిస్టేబుల్

మార్కాపురంరూరల్: రైలు కిందపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మార్కాపురంలోని విజయటాకీస్ ప్రాంతంలో నివాసముండే హమీద్ (50) మృతదేహాన్ని ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో మార్కాపురం నుంచి గజ్జలకొండ వెళ్లే రైలు మార్గంలో స్థానికులు గుర్తించి సమాచారమిచ్చారు. పట్టాల పక్కన మృతదేహం ఉండటంతో ప్రమాదవశాత్తు పడ్డాడా ? ఆత్మహత్యా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడి కేసు నమోదు

అర్ధవీడు(బేస్తవారిపేట): నమ్మించి మోసం చేశాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు లైంగిక దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం అనిత తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం...అర్ధవీడు మండలం చింతమల్లెలపాడుకు చెందిన శెట్టి అనిల్‌కుమార్, మిట్టమీదిపల్లెకు చెందిన అమ్మాయిని(20) ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు శారీరకంగా వాడుకున్నాడు. ఈ క్రమంలో మరో యువతితో నిశ్చితార్థం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న యువతి అర్ధవీడు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసును కంభం సీఐ రామకోటయ్య దర్యాప్తు చేస్తారన్నారు.

మాగుంట లిక్కర్ కంపెనీలో విజిలెన్స్ తనిఖీలు

ఒంగోలు టాస్క్‌ఫోర్స్: సింగరాయకొండ మండల పరిధిలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి చెందిన లిక్కర్ కంపెనీ పెరల్ డిస్టిలరీలో ఆదివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు ఆ శాఖకు చెందిన అధికారి ధృవీకరించారు. రాష్ట్రంలోని లిక్కర్ కంపెనీల్లో ప్రతి సంవత్సరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా మద్యం శాంపిల్స్ సేకరిస్తామని, ఆ ప్రకారం తనిఖీలు నిర్వహించి శాంపిల్స్ సేకరించినట్లు పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తీగ, ఆయిల్, కేబుల్ చోరీ

– రూ.9 లక్షల విలువైన వస్తువులు అపహరణ


రాగితీగ, ఆయిల్ చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

పామూరు: మండలంలోని ఇనిమెర్ల సమీపంలోని భైరవ మినరల్స్ ఫ్యాక్టరీకి చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్, రాగి తీగ, విద్యుత్ సరఫరా చేసే కేబుల్ చోరీకి గురయ్యాయి. చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ విలువ రూ.2 లక్షలు, రాగితీగ రూ.3 లక్షలు, కండక్టింగ్ వైర్ రూ.4 లక్షలు మొత్తం రూ.9 లక్షల విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు తెలిపారు. దీనిపై సిద్ధమూర్తి నారాయణరెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు సన్మానం

ఒంగోలు: ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులను మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజాక్ తదితరులు ఘనంగా సత్కరించారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇటీవల ప్రకటించిన ట్రిపుల్ ఐటీ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తమ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కాలేజీల్లో సీట్లు దక్కించుకోవడం గర్వంగా ఉందని కొనియాడారు. ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించడం కష్టమైన పని అయినా అద్భుతమైన ఫలితాలు సాధించారంటూ విద్యార్థులను ప్రశంసించారు. ట్రిపుల్ ఐటీలో కూడా రాణించి మంచి ఉన్నత స్థానానికి చేరుకుని సామాజికవర్గంలో వెనుకబాటుకు గురైన వారికి అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు బొంత జేసుదాసు, ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కేవీఎస్ రాజు, ఒంగోలు మాజీ ఉప విద్యాశాఖ అధికారి ఇత్తడి సాల్మన్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు తోరటి ఆనంద్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి సర్వేపల్లి రవిరాజ్‌లు విద్యార్థులకు లగేజి బ్యాగు, సర్టిఫికెట్లు భద్రపరుచుకునేందుకు ఫైలు, మెమెంటో, వాటర్ బాటిల్‌లను అందించి సత్కరించారు.

ఇవి ఏ రాణా తాలూకానో?

మా బండి..మా ఇష్టం..రూల్స్ గిల్స్ జాన్తానై.. మా ఇష్టమొచ్చినట్లు నంబర్ ప్లేట్లు పెట్టేస్తాం..

ఇదీ జిల్లాలో కొందరు ద్విచక్రవాహనదారుల తీరు. నంబర్ ప్లేట్ల స్థానంలో తాము ఫలానా మంత్రి తాలుకా, ఎమ్మెల్యే తాలుకా అంటూ బోర్డులను ఏర్పాటు చేసుకొని నిబంధనలను గాలికొదిలేసి దర్జాగా తిరిగేస్తున్నారు. పోలీసులు వీరి ఆటలకు అడ్డుకట్ట వేయకుంటే మరింత శృతిమించే ప్రమాదం ఉంది.

– సాక్షి, ఒంగోలు























స్పా సెంటర్లపై దాడుల్లో 10 మంది అరెస్టు

ఒంగోలు టౌన్: నగరంలో అసాంఘిక, అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతున్న స్పా సెంటర్లపై శనివారం రాత్రి పోలీసులు చేసిన దాడుల్లో మొత్తం 10 మందిని అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ షేక్ ఖాజావలి తెలిపారు. ఆదివారం సాయంత్రం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలతో సబ్ డివిజన్ పోలీసులు బృందాలుగా విడిపోయి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. నగరంలోని 16 స్పా సెంటర్లపై ఏకకాలంలో చేసిన దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా అనైతిక కార్యకలాపాలను నిర్వహిస్తున్న గుంటూరు రోడ్డులోని సార బ్యూటీ సెలూన్ అండ్ స్పా సెంటర్ నిర్వాహకుడు ఒంగోలు పాత గుంటూరు రోడ్డుకు చెందిన కిమిడి పవన్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. అతడితో పాటుగా కేరళ రాష్ట్రంలోని అనికుపురిల్ గ్రామానికి చెందిన కొడువాలిల్ నితిన్, మార్కాపురం పట్టణంలోని


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐలు

పాండురంగస్వామి వీధికి చెందిన ఈత అవినాష్, మార్కాపురంలోని నెహ్రూ బజార్‌కు చెందిన కనమర్లపూడి పద్మనాభంలను అరెస్టు చేశారు. దాడి సమయంలో తప్పించుకున్న మరో వ్యక్తిపై తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రత్యేకమైన కేసు నమోదు చేశారు. అంజయ్య రోడ్డులోని ఎస్ఎస్ సెలూన్ అండ్ స్పా సెంటర్ నిర్వాహకుడు ఒంగోలు గాంధీనగర్‌కు చెందిన తురిమెళ్ల పోతురాజుతో పాటుగా ఒక మహిళను, టంగుటూరు మండలం కొణిజేడు గ్రామానికి చెందిన మానం నాగరాజులపై తాలుకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఓ రేంజ్ యునిసెక్స్ సెలూన్ అండ్ స్పా సెంటర్ నిర్వాహకుడు ఒంగోలు ఎంఎం డొంకకు చెందిన కొణిజేటి కన్నయ్యతో పాటుగా ఒక మహిళను, రాజాపానగాల రోడ్‌కు చెందిన మహిళను, తెలంగాణలోని కోహిర్ గ్రామానికి చెందిన ఎండీ ముజాజౌల్ హుసేన్‌లపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. స్పా, మసాజ్ సెంటర్ల పేరుతో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. అనుమతులు లేని స్పా, స్నూకర్, రిక్రియేషన్ క్లబ్‌లకు ఇళ్లను అద్దెకిచ్చి కేసుల్లో ఇరుక్కోవద్దని ఇళ్ల యజమానులకు సూచించారు. దాడుల్లో డీఎస్పీ కిశోర్‌బాబుతో పాటుగా సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు పాల్గొన్నారని తెలిపారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ షేక్ అలీ సాహెబ్, టూటౌన్ సీఐ జగదీష్ పాల్గొన్నారు.

నడిరేయి మృత్యుకేక

- ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తాపడి ఇద్దరు మృతి, మరో 8 మందికి గాయాలు
- అమరావతి–అనంతపూర్ హైవేపై ఘటన


క్రేన్ సహాయంతో బస్సును బయటకు తీయిస్తున్న పోలీసులు


మృతి చెందిన విజయలక్ష్మీబాయి

మార్కాపురం: హైవేపై అర్ధరాత్రి గేదెలు అడ్డురావడంతో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తాపడిన ఘటనలో ఇద్దరు మృతిచెందగా, 8 మందికి గాయాలయ్యాయి. మార్కాపురం మండలం చింతగుంట్ల, తిప్పాయపాలెం గ్రామాల మధ్య అమరావతి–అనంతపూర్ హైవేపై శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో మృతుల్లో ఒకరైన అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన గజ్జల్ల శివయ్య (45) మోడీకేర్ నెట్‌వర్క్ మార్కెటింగ్‌లో జీఆర్‌డీడీ ర్యాంకులో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలకు చెందిన పలువురు ఏజెంట్లకు శిక్షణ ఇస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మూడు రోజులుగా చిలకలూరిపేటలో శిక్షణ ఇస్తూ శనివారం రాత్రి పదిన్నర గంటలకు ధర్మవరం వెళ్లేందుకు ప్రైవేటు ట్రావెల్స్ బస్సెక్కి ప్రమాదంలో మృతి చెందాడు. ఆయనకు భార్య సువర్ణ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ విషయం తెలియడంతో పలువురు ఆయన మృతదేహాన్ని సందర్శించేందుకు వచ్చారు. మృతి చెందిన విజయలక్ష్మీబాయి విజయవాడ నుంచి అనంతపూర్ వెళ్తోంది. ఆమెకు భర్త కాశీనాయక్, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అదేవిధంగా పెద్దారవీడు మండలం కలనూతల గ్రామానికి చెందిన కె


కుటుంబ సభ్యులతో శివయ్య (ఫైల్)

విజయలక్ష్మీబాయి (40)కి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను మార్కాపురం జీజీహెచ్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలిస్తుండగా నరసరావుపేట వద్ద మృతి చెందింది. ఈ సంఘటనలో హరినాథ్, రాజీబీ, నాగమయ్య నాయక్, ధమరుకానందరెడ్డి, మునీందర్‌రెడ్డి, అప్సన్, మోహిత్, దస్తగిరిలకు గాయాలయ్యాయి. వీరికి జీజీహెచ్‌లోనే చికిత్స అందించారు. బోల్తాపడిన సమయంలో మొత్తం 30 మంది ప్రయాణికులు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న మార్కాపురం సీఐ అవుల వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బోల్తాపడిన బస్సును క్రేన్ సహాయంతో బయటకు తీశారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి స్వస్థలాలకు పంపించే ఏర్పాట్లు చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతానికి ఇద్దరు దుర్మరణం

దర్శి: వేర్వేరు ప్రాంతాల్లో విద్యుదాఘాతానికి ఇద్దరు మృతి చెందారు. దర్శిలో రైతు పొలానికి నీళ్లు పెట్టుకునేందుకు మోటార్ ఆన్‌చేసే సమయంలో షాక్‌కు గురై మృతి చెందాడు. గిద్దలూరు మండలం కొండపేట గ్రామంలో గాలి పటం తీసే క్రమంలో బాలుడు మృతి చెందాడు.

దర్శిలో..

విద్యుదాఘాతానికి కొత్తపల్లి చిన్ననాసరయ్య(43) అనే రైతు మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. పొగాకు మొక్కలు వేయాలని పొలంలో ఏర్పాటు చేసుకున్న గుంటకు నీళ్లు పెట్టేందుకు మోటార్ స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. నేలపై తేమ ఉండటంతో విద్యుత్ షాక్ తీవ్రంగా తగిలిందని భావిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాలుగు ఎకరాలు మెట్ట పొలం సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమార్తెకు వివాహం కాగా


నాగేంద్ర మృతదేహం

కుమారుడు చదువుకుంటున్నాడు. కుటుంబ పెద్ద చిన్ననాసరయ్య మృతితో కుటుంబానికి ఆదరువు లేకుండా పోయింది. నాసరయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గిద్దలూరు రూరల్: విద్యుదాఘాతానికి బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కొండపేటలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఈరుగుల నాగేంద్ర(11) గాలిపటంతో ఆడుకుంటున్న సయమంలో గాలిపటం చెట్టుకొమ్మలో ఇరుక్కుపోయిందా. చెట్టు ఎక్కి గాలిపటం


చిన్ననాసరయ్య మృతదేహం

తీసే ప్రయత్నంలో చెట్టు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్‌తీగలు తగిలి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. నాగేంద్ర 5వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఇద్దరు కూలీ పనిచేసుకుంటూ జీవనం గడిపేవారు. సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ సరఫరా నిలిపివేసి నాగేంద్ర మృతదేహాన్ని బయటకు తీశారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

సాయితత్వం..విశ్వవ్యాప్తం..

- ఘనంగా నిరాడంబరి శ్రీసాయి పుస్తకావిష్కరణ

మార్కాపురం: సాయితత్వం విశ్వవ్యాప్తమని రాష్ట్రపతి అవార్డు గ్రహీత తంగిరాల జగన్నాథ్, ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా యజ్ఞోపవీతం పత్రిక సంపాదకుడు రుగంటి మల్లిక్ రచించిన నిరాడంబరి శ్రీ సాయి గ్రంథావిష్కరణ ఆదివారం దత్తసాయి రామాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీసాయి నాథుని గుణగణాల్లో నిరాడంబరత చాలా ముఖ్యమైందని, ఆ విషయాన్ని బాబా జీవిన విధానం నుంచి వెలికితీసి భక్తులకు అందించడంలో రచయిత కృతకృత్యులయాయరన్నారు. ప్రముఖ కవులు డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ మాట్లాడుతూ నిరాడంబరీ శ్రీ సాయి అనే గ్రంథం సరళశైలిలో శుభోదకంగా ఉంద


పుస్తకావిష్కరణలో పాల్గొన్న మల్లిక్ తదితరులు

ని, భక్తి సాహిత్యంలో గుర్తింపు పొందుతుందన్నారు. సాయిబాబా ఆదర్శప్రాయుడైన సద్గురువుగా జీవించి సమాజానికి తన జీవితాన్ని ఒక సందేశంగా ఇచ్చి వెళ్లారని, దాన్ని మనం అందిపుచ్చుకోవాలన్నారు. రచయిత, పాత్రికేయుడు ఓపీ మల్లిక్ మాట్లాడుతూ బాబా ఆశీస్సులతోనే ఈ పుస్తకాన్ని రాశానన్నారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కవులు తోట శ్రీనివాసరావు, కొండ్రెడ్డి నాగిరెడ్డి, కంభం ఎంఈఓ 2 శర్వాణి, మల్లిక్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ఒంగోలు టౌన్: పుస్తకం చదవడం అలవాటు చేసుకుంటే అది మనలోని అజ్ఞానపు చీకట్లను తరుముతుందని జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి అన్నారు. గురు పౌర్ణమి రోజున వేద వ్యాస మహర్షిని స్మరించుకోవాలని సూచించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు కథలు చదివి వినిపించారు. పుస్తకాలను ఇచ్చి చదివించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గురువుల పట్ల గౌరవం కలిగి ఉండాలని చెప్పారు. గురుపౌర్ణమి రోజున గురువుల ఆశీసులు పొందడం ఎంతో అదృష్టం అని పేర్కొన్నారు. అబ్రహం లింకన్, భగత్‌సిం


పుస్తకాలు చదువుతున్న చిన్నారులు

గ్, అంబేద్కర్, లెనిన్‌లు పుస్తకాలను చదవడం వల్లే గొప్పవారయ్యారని రచయిత వెంకటేశ్వరరెడ్డి చెప్పారు. కె. సంపూర్ణమ్మ, ఎస్ అనిల్, నున్నా అంజనేయులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు పెద్దపీట

ఒంగోలు: ప్రయాణికుల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో గురుపౌర్ణమిని పురస్కరించుకుని రెండు స్టార్‌లైనర్ బస్సులు, మూడు సూపర్ లగ్జరీ బస్సుల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా బస్సుల ప్రారంభోత్సవం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రకాశం రీజియన్‌కు మొత్తం 67 బస్సులు మంజూరయ్యాయన్నారు. గత పది రోజుల్లోనే 4 స్టార్ లైనర్‌లు, 5 సూపర్‌లగ్జరీలు ప్రారంభించినట్లు తెలిపారు. పాత బస్సుల స్థానంలో దశలవారీగా నూతన బస్సులను ప్రవేశపెడతామన్నారు. ఈ దఫా ఒంగోలుకు వచ్చే బస్సుల్లో ఒక స్టార్‌లైనర్‌ను తిరుపతికి కేటాయించాలని ఆర్ఎంకు సూచించారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది అందరికీ ప్రభుత్వ పరంగా అండగా ఉంటామన్నారు. సూపర్ సిక్స్‌కు సంబంధించి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విధి విధానాలు ప్రస్తుతం రూపొందిస్తున్నామని, విధి విధానాలు పూర్తి కాగానే ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని చెప్పారు. ఆర్టీసీ ప్రజారవాణాధికారి బి.సుధాకర్ మాట్లాడుతూ ఈ ఏడాది మొత్తం 67 బస్సులు రీజియన్‌కు రానున్నట్లు తెలిపారు. గతంలో బస్సు తిరిగిన కిలోమీటర్లను దృష్టిలో ఉంచుకుని స్క్రాప్ బస్సులను నిర్ధారించే వారమని, కానీ ప్రస్తుతం 15 ఏళ్ల గడువు ముగియగానే వాటిని స్క్రాప్‌గా నిర్ధారించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో స్టార్‌లైనర్, వెన్నెల స్లీపర్ బస్సులకు మంచి ఆదరణ ఉందని, ప్రస్తుతం ఉన్న 60 సీట్ల స్థానంలో అదనంగా మరో 60 సీట్లు ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు అందుబాటులోకి తెచ్చామన్నారు. పొదిలికి కూడా మరో రెండు స్టార్ లైనర్ బస్సులు త్వరలోనే రానున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆర్టీసీ ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాసులు, ఆర్టీసీ అధికారులు, ఆర్టీసీ సంఘాల నాయకులు, ప్రయాణికులు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చనిపోయిన టీడీపీ వాళ్ల కుటుంబాల వద్దకు కూడా వెళ్లి మాజీ సీఎం జగన్ పరామర్శిస్తే బాగుండేదన్నారు.


ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి దోల బాలవీరాంజనేయస్వామి